# ఈ చరిత్ర ఇలాగే వుండదు!

పోల్కంపల్లి శాంతాదేవి



**ఆరోజు ఆఫీసుకు రాగానే** వెడ్డింగ్ కార్డ్స్ పంచసాగాడు భాస్కర్.

"ఇంత సడెన్‌గా వెడ్డింగ్‌కార్డ్స్ పంచుతున్నావేమిటోయ్? పెళ్ళెప్పుడు సంగతే తెలియదు. పెళ్ళిచూపులు ఎప్పుడయ్యాయి? ఎప్పుడు సంబంధం సెటిల్ అయింది?" పెళ్ళిపత్రిక చదువుకొంటూ అడిగాడు. ఆఫీసు హెడ్ సుదర్శనం.

"వారం రోజులక్రితమే పెళ్ళిచూపులు జరిగాయి. పిల్ల నచ్చిందా అని అడిగితే నచ్చిందని చెప్పాను. ముహూర్తాలు పెట్టేసుకున్నారు పెద్దవాళ్ళు!" ఉత్సాహం ఉరకలు వేస్తున్నట్టుగా చెప్పాడు భాస్కర్.

"పాపం! నీమీద ఆశలుపెట్టుకొన్న వాళ్ళను నడియేట్లోకి త్రోసేశావు కదా?" ఓరగా సువర్ణకేసి చూస్తూ అన్నాడు సుదర్శనం.

"ఆశలు పెట్టుకొన్న వాళ్ళందరినీ పెళ్ళాడుతూపోతే అష్ట భార్యల మొగుణ్ణి అవుతాను!" భాస్కర్ నవ్వాడు.

విభ్రాంతిగా చూస్తున్న సువర్ణని శూలంలా గ్రుచ్చుకొని బాధపెట్టింది అతడి నవ్వు. అందరితోపాటు కార్డు ఇవ్వడానికి అతడు ముందుకు రాగానే, కాళీ అవతారం ఎత్తినట్లుగా ఉగ్రంగా అతడి చొక్కా పట్టుకొంది. "భాస్కర్ నువ్వు నన్ను ఇంత మోసం చేస్తావా?"

"ఎంత మోసం చేశాను?" భాస్కర్ ఎగతాళిగా అడిగాడు.

"ఇంత!" బాచి పెట్టివేసింది భాస్కర్ చెంపమీద.

అవమానంతో జేవురించింది భాస్కర్ ముఖం. "ఎంత పొగరు నీకు? నామీదే చెయి చేసుకొంటావా? నేను తలుచుకొంటే నిన్ను నల్లిని నలిపినట్టుగా నలిపివేయగలను."

"నీ సరదా తీరేవరకు పువ్వులా ఆఘ్రాణించావు. ఇప్పుడు నల్లిలా కనిపిస్తున్నాను కదూ?"

"మనం పర్సనల్‌గా మాట్లాడుకొందాం. ఇక్కడ ఆఫీసులో సీన్ క్రియేట్ చేయకు."

"బజారుపాలు చేశావు బ్రతుకును! ఇంకా చాటుమాటు ఏముంది?" కోపం దుఃఖంలోకి మారిపోయి కళ్ళనిండా నీళ్ళు నింపాయి సువర్ణకు.

"కోరి వెంట బడ్డావు! వయసున్న నీతైన మగవాడిని! ప్రవరుణ్ణి, భీష్ముణ్ణి కాను!"

"కోరి నేను వెంటబడ్డానో, కోరి నువ్వు వారికి తెచ్చుకొన్నావోగాని, ఈ పెళ్లి ఎలా జరుగుతుందో నేను చూస్తాను! సరదా

ఒక ఆడదానితో, పెళ్లి మరొక దానితోనా? ఈ అన్యాయం నేను జరగనివ్వను."

"ఏడిశావ్! ఏం చేసుకుంటావో చేసుకోఫో!" అని కార్య పంచకం పూర్తి చేసి తన సీటులోకి వెళ్ళిపోయాడు భాస్కర్.

సువర్ణ ప్రక్కసీటులో ఉండే జానకి, "ఎంతపనిచేశావు సువర్ణా? ఏ మోసమైనా బయటికి చెప్పుకోవచ్చువేమోగాని, ఆడది మగవాడివల్ల తనకు జరిగిన మోసాన్ని బయటికి చెప్పుకోవచ్చునా? రేపు స్టాఫ్ అంతా ఎలా చూస్తుందో నిన్ను. నడుస్తూ నడుస్తూ హఠాత్తుగా బురదగుంటలో దభిల్లున పడిపోయిన మనిషిని దారిన నడిచే వాళ్ళు చూస్తారే ఎగతాళిగా, వెటకారింతగా, అలా చూస్తున్నారు!" అంది జాలిగా.

"మోసం జరిగిన ప్రతి ఆడది ఈ భయంతోనే తేలుకుట్టిన దొంగలా ఉండిపోవటంవల్లే మగవాడు రెచ్చిపోతున్నాడు. ఇదే అదనుగా తీసుకొని ఆడదాన్ని సులువుగా మోసంచేయగలుగుతున్నాడు మగవాడు. నేను మాత్రం తెలివితక్కువగా ఊరుకోను. అతడు చేసిన మోసాన్ని నేను పదిమందిలో పెడతాను. న్యాయాన్ని కోరుతాను" ఆవేశంగా అంది సువర్ణ.

"తప్పటడుగు వేసి వైతే న్యాయం చెప్పడం పదిమంది బాధ్యతా?"

"నా తప్పటడుగులో ఆ మగవాడికి భాగం లేదా? అతడికి బాధ్యత లేదా?"

"పెళ్లికి ముందు తప్పటం లాంటి ప్రమాదాలు ఆడవాళ్ళకేగాని, మగవాళ్ళకి వుంటదా?"

"జానకీ, నాకు ఈ నెల మెన్సెస్ కాలేదే" గొంతు తగ్గించి భయంగా అంది సువర్ణ.

"నీ పెళ్లి ఏర్పాటు చూసుకో. చదువుకొన్నావు, ఉద్యోగం కూడా వెలగబెడుతున్నావు. ఆ మాత్రం ఇంగితం లేకుండా పోయిందా?"

"కళ్ళని వయసు పొరలు క్రమ్మినప్పుడు ఉద్యోగం, చదువు, సమాజం, కట్టుబాట్లు ఇవేవీ కనిపించవు. జ్ఞాపకంరావు."

"ఇప్పుడు పొరలు దిగాయనుకుంటాను"

"జానకీ నువ్వూ నన్ను ఎగతాళి చేస్తే ఎలా? ఏదైనా సలహా ఇవ్వు. నాకేమీ పాలు పోవడంలేదు. నా మనస్సంతా భగ భగ మండిపోతూంది. పిచ్చెక్కిపోతున్నట్టుగా ఉంది. నా జీవితం తగులబెట్టి, తనకేమీ పట్టనట్టుగా అతడు చూడు తన పని ఎలా చేసుకొంటున్నాడో! పెళ్ళి కళతో ఎలా వెలిగిపోతూందో చూడు ఆ ముఖం!" అక్కసుగా అంది సువర్ణ, మరో బల్ల ముందు తన పనిచేసుకొంటున్న భాస్కర్‌ని నిప్పులు చెరుగుతున్నట్టుగా చూస్తూ.

"అతడికి పిల్లనిస్తున్న వాళ్ళ అడ్రస్‌కి ఒక జాబు వ్రాసిపడెయ్యి, ఆకాశరామన్న పేరుతో! భాస్కర్ వట్టి మోసగాడని, ఆడ పిల్లలతో ఆడుకొనే స్వభావముందని, తన ఆఫీసులో పనిచేస్తున్న టైపిస్ట్‌తో సంబంధ ముందని."

"ఆకాశరామన్న పేరెందుకు? డైరెక్టుగా నా పేరుతోనే వ్రాస్తాను! రాస్కెల్ ఇవ తల ఒక జీవితాన్ని తగులబెట్టి తనుమాత్రం పెళ్ళి చేసుకు కులుకుతాడూ? ఆ పెళ్ళి ఎలా జరుగుతుందో నేను చూస్తాను? అతడి జీవితం సర్వనాశనం చేస్తాను."

"మగవాడెప్పుడూ నిత్యపరాయుడే. అత డిని నువ్వేమీ చేయలేవని నా నమ్మకం. తన వల్ల ఎన్ని జీవితాలు నాశనమైనా తడి అంటని తామరాకులా ఉండగల వరం ప్రకృతి అతడికిచ్చింది సువర్ణా! అల్లరిపెట్టా లంటే అస్సలు అల్లరి పడేదినువ్వే! అతడి మగతనానికి కిరీటం తొడిగినట్టుగా అవు తాయి ఇలాంటి కృష్ణలీలలు. ఇహపోతే, నా సలహా ఏమిటంటే, నువ్వు డైరెక్టుగా నీ పేరుతో వ్రాయడం బాగుండదు. పెళ్ళిళ్ళు చెడగొట్టాలంటే ఆకాశరామన్న ఉత్తరాలే మంచి పనిచేస్తాయి. నీ పేరుతో వ్రాసి అనవసరంగా చిక్కుబడకు. నిన్ను నీవు ప్రచారం చేసుకోకు!"

తన ప్రతాపం ఏమిటో భాస్కర్‌కి చూపదలచుకొన్న సువర్ణ ఈ సలహాను పాటించలేదు. కష్టపడి పిల్లనిచ్చే వాళ్ళ అడ్రస్ సంపాదించి తన పేరుతోనే ఉత్తరం వ్రాసింది, భాస్కర్, తను ఒకే ఆఫీసులో పనిచేస్తుంటామని, భాస్కర్ తనని ప్రేమించినట్టు నటించి వల్లో వేసుకొన్నాడని, తనిప్పుడు తల్లికూడా కాబోతున్నానని అలాంటివాడికి మీ పిల్లనిస్తే మీ పిల్ల జీవితం నరకమే అవుతుందని హెచ్చరిస్తూ వ్రాసింది. భాస్కర్‌ని ఊరికే విడిచిపెట్టదలుచుకోలేదు. అతడి బతుకు యాగీ చేసి పెడతానని తన మనసులోని భగ భగలూ, బుస బుసలూ అన్నీ ఆ ఉత్తరంలో కురిపించింది.

* *

"నీ కూతురి నిర్వాకం గురించి విన్నావా అమ్మా? ఆఫీసులో ఇది ఎవడినో ప్రేమిం చిందట; వాడితో తిరిగిందట; వాడిప్పుడు వేరే పెళ్ళిచేసుకొంటున్నాడని ఆఫీసులో స్టాఫ్ ముందే వాడి చొక్కా పట్టి గుంజి గోల చేసిందట. మా ఫ్రెండొకతను ఈ సంగతి చెబుతూంటే నా ప్రాణం చచ్చినట్టయింది!" సువర్ణ అన్న తల్లితో చెబుతూంటే, సువర్ణ ఇంటి గడపలో అడుగు పెట్టింది.

"తప్పు చేసిందికాక తగుదునమ్మా అని చాటింపుకూడా చేసుకొందా? అయ్యో! దీనికి ఏం పోయేకాలం వచ్చింది. ఈ పాపిష్టి దానికి తల్లినని ఎలా చెప్పుకోనమ్మా ఏ నూతినో, చెరువునో చూసుకొని చచ్చి పోతాను." అని రాగాలు పెట్టింది తల్లి.

"రేపటినుండి నువ్వు ఉద్యోగానికి పోనక్కరలేదు. ఇంట్లోనే పడిఉండు." హుకుం జారీ చేశాడు అన్న.

"నీ అధారిటీ ఏమిటి నామీద?" మండి పడింది సువర్ణ.


"నోర్ముయ్! చదువుకొన్నావు; నీ మంచి చెడ్డలు నువ్వు చూసుకోగలవనుకొన్నాను. ఇలా మదమెక్కిపోయి ప్రవర్తిస్తావనుకో లేదు. ఇక నోరెత్తావా, కాళ్ళుచేతులు కట్టి పడేస్తాను. జాగ్రత్త."

"నీ పౌరుషం నాదగ్గరేం చూపుతావు? వెళ్ళి భాస్కర్ దగ్గరచూపు. నీ చెల్లెల్ని మోసంచేసినవాడి అంతు కనుక్కోవడం అలా ఉంచి నా చేతులు కాళ్ళు కట్టిపాడేస్తా నంటున్నావు మహా. నీ సొమ్మేం తినడం లేదు. నీ అధికారం నామీద చెలాయించ డానికి."

"అందుకేనే, ఆడముండలకి చదువు లొద్దని చెప్పింది. ఇలా బరితెగించిపోతారనే"

"ఉద్యోగం సద్యోగంలేని, అన్నగారూ! నా సంపాదనతో మూడేళ్ళుగా బ్రతుకుతూ, ఇవాళ ఆడముండలకి చదువులొద్దని నీతి పాఠాలు చెబుతున్నారు."

"ఇంకా ఏ మొహం పెట్టుకొని ఎదు రెదురు మాట్లాడుతున్నావే? సిగ్గులేకపోతే సరి!" తల్లి అడ్డొచ్చింది కొడుక్కి. "రేపటి నుండి ఇది ఇల్లు కదలకుండా చూస్తాను. ఆ కృష్ణాపురం సంబంధం ఖాయం చేసుకు రారా. ఈ సంగతి నలుగురి నోట్లోకి ప్రాకి పోకముందే ఆ మూడుముళ్ళు వేయించి పంపించేద్దాం."




"రెండో సంబంధం చేసుకోకుందిగా?"

"ఇహ దాని మాట వినేదెవరు? దాని మాటకు ఓ విలువ ఇవ్వడం కూడానా?"

○ ○ ○

జానకి స్నానంచేసి బాత్‌రూం నుండి వస్తూంది.

తల్లి గబగబా వచ్చి, అంది "అది... వచ్చింది. దానితో ఎక్కువ మాట్లాడకుండా పంపించేసేయ్. దానితో స్నేహం ఇంతటితో కట్‌చెయ్యి. మరోసారి అది ఈ ఇంటికి వస్తే నేనే తగు మర్యాద చేసి పంపించేస్తాను."

"అది....ఎవరమ్మా?" జానకి అయోమయంగా అడిగింది.

తల్లి చెప్పక్కరలేకుండానే సువర్ణ ఆవిడ వెనుక కనిపించింది.

వివర్ణంగా మారిన సువర్ణ ముఖం చూసి గతుక్కుమంది జానకి. "ఏం మాటలమ్మా అవి? ఇంటికి వచ్చిన మనిషిని అలాగేనా అవమానించడం?" అని మందలించింది తల్లిని.

"లేదు. కుర్చీవేసి మర్యాద చేస్తాను." ఆవిడ ఈసడింపుగా వంటపనిమీద విసావిసా వెళ్ళిపోయింది.

జానకి ఇంట్లోకివచ్చి, అద్దంలో ముఖం చూచుకొని బొట్టు దిద్దుకొంటూ అంది. "చూశావా సువర్ణా? ఆడదానికి శీలం ఎంత విలువైనదో. ఏదో తప్పటడుగు వేశావు, అది గుట్టుగా దాచుకొంటే ఎవరికీ తెలిసేదికాదు. భాస్కర్‌ని ఈ సమాజం ముందు దోషిగా నిలబెట్టడం కోసం నీ తప్పటడుగు బయట పెట్టుకొన్నావు. భాస్కర్‌ని ఎవరూ దోషిగా చూడడంలేదుగాని, నిన్నే అందరూ హీనంగా చూస్తున్నారు."

"ఈ సమాజం సన్మాన ఛీత్కారాలు నేను లెఖ్ఖచెయ్యడంలేదు."

"సమాజాన్ని న్యాయం చెప్పమని ఎందుకడుగుతున్నావుమరి?"

"ఇక అడగను. నాకు జరిగిన అన్యాయానికి నేనే ప్రతీకారం తీర్చుకొంటాను.." మొండిగ అంది సువర్ణ. "నాకు అర్జంటుగా ఇల్లు కావాలి అద్దెకు. లేడీస్ హాస్టల్లో చేరడానికి ఫస్ట్‌వరకూ ఆగాలన్నారు. అయినా హాస్టల్‌కి, ఆఫీసుకి దూరం."

"ఇప్పుడు ఇల్లెందుకు?"

"నేను ఇంట్లో తెగతెంపులు చేసుకొని వచ్చేశాను. నాకు రెండో సంబంధం వాడితో పెళ్ళిచేయడానికి సర్వసన్నాహాలు చేస్తుంటే. పోట్లాడి వచ్చేశాను."

"చేసింది ఒక్క పొరపాటు. అందరినీ పోగొట్టుకొంటున్నావు. తప్పులు చాలామంది చేస్తారు. అందరూ ఇలాగే బయటపడుతున్నారా? పరువును బజారులో పెట్టుకొంటున్నారా? గుట్టుగా జీవితాన్ని చక్కదిద్దుకోవడం లేదూ? జరిగిన పొరపాటును దిద్దుకోవడం తెలివైనపనికాని, ఆ తప్పుకే జీవితాన్ని బలిచేసుకోవడం...ఊహూ నేను హర్షించలేకపోతున్నాను నీ ప్రవర్తన. నీ స్నేహితురాలిగా నేనెంత బాధపడుతున్నానో తెలుసా? కాని, నా మాట వినవుకదా?"

"చెడిపోయినదాన్నే కావచ్చు. జీవితంలో ఎవరినీ మోసగించలేను, జానకీ...నాకు ఇల్లు చూసిపెడతావా లేదా?"

"సుబ్బమ్మత్త ఇంట్లో ఒక గది ఖాళీ అయినట్టు విన్నాను. పద అడుగుదాం."

○ ○

భాస్కర్ పెళ్ళికని పదిహేనురోజులు సెలవుపెట్టి ఊరికి వెళ్ళిపోయాడు.

అదే రోజు భాస్కర్‌కి పిల్లనిస్తున్నాయన ఆఫీసుకు వచ్చాడు. ఆఫీసుముందు నిలబడి అటెండరును, "ఈ ఆఫీసులో సువర్ణ అనే టైపిస్ట్ ఉందిటగా? ఇవాళ ఆఫీసుకి వచ్చిందా?" అని అడిగాడు.

"వచ్చింది. హాల్లోకి వెళ్ళండి. టైప్‌మిషన్ ముందున్నావిడే సువర్ణ." అని చెప్పాడతను.

ఆయన సువర్ణ ముందుకు వచ్చి నిలబడ్డాడు. కొద్దినిమిషాలు మౌనంగా, సువర్ణని అంచనావేస్తున్నట్టుగా ఎగాదిగా చూశాడు.

తీక్షణంగా ఉన్న అతడి చూపులకు కలిగిన కలవరపాటును కప్పిపుచ్చుకొంటూ, "ఎవరండీ మీరు? ఎవరు కావాలి?" అని అడిగింది సువర్ణ.

"నాది పెద్దాపురం. నాపేరు రామకృష్ణారావు." ఎవరినో అర్థమైందా అన్నట్టుగా చూశాడు.

"ఓ మీరా? నేననుకొన్నట్టే వచ్చారన్నమాట." సంతోషంగా అంది సువర్ణ. "మీ కాబోయే అల్లుడి కథ డైరెక్టుగా తెలుసుకోవడానికే వచ్చారనుకొంటాను."


"కాదు! నీ నోరు మూద్దామని!" కరుగ్గా అన్నాడు ఆయన.

సువర్ణ బొత్తిగా ఊహించని జవాబు అది తెల్లబోయి చూసింది

"కొంచెం బయటికి వస్తావా? రెండు మాటలు మాట్లాడి పోతాను."

"బయటికెందుకు? మాట్లాడేదేదో ఇక్కడే మాట్లాడండి. నా బ్రతుక్కి ఏం రహస్యాలు మిగుల్చుకోలేదు."

"నీలాంటి బజారు సరుకు ఆఫీసుల్లో చేరితే మగ పిల్లలు పాడైపోక ఏం చేస్తారు? చూస్తూనే తెలిసిపోతూంది పెళ్ళిళ్ళేకాదు, సంసారాలు కూల్చేరకానివని. లేకపోతే, వారం రోజుల్లో పెళ్ళి ఉండగా పెళ్ళి చెడగొట్టడానికి ఉత్తరం వ్రాస్తావా? వారం రోజుల్లో ఉన్న పెళ్ళి చెడిపోతే మళ్ళీ దానికి




పెళ్ళి కుదర్చడం ఎంత కష్టమౌతుందో తెలుసా? ఇదిగో ఈ డబ్బు తీసుకొని నీ నోటికి సీల్ వేసుకో. అల్లరిపెట్టావంటే నీ ఆట ఎలా కట్టించాలో నాకు తెలుసు. నేను రాజకీయ పక్షిని. నీలాంటి వాళ్ళ నోరు ఎలా కట్టేయాలో నాకు తెలుసు." బాగ్‌లోంచి నోట్లకట్ట ఒకటి తీసి బల్లమీద పడేసి, త్వర త్వరగా వెళ్ళిపోతున్న ఆయన్ని కళ్ళువెళ్ళ బెట్టుకు చూడసాగింది సువర్ణ. ఆయన గుమ్మం దగ్గరికి వెళ్ళాక తెలివి తెచ్చుకొని, "ఏయ్! అగు! ఈ డబ్బు తీసికెళ్ళు." ఉరిమినట్టుగా పిలిచింది.

"ఆయన వెనక్కి వచ్చాడు. డబ్బు తీసుకొని బాగ్‌లో వేసుకొన్నాడు. "డబ్బుతో అవసరం లేకుండానే నీ నోరు కట్టేసుకొనేట్టయితే మంచిదే. లేకపోతే, నా తడాఖా చూస్తావు."

"ఏంచేస్తావేమిటి ?" కొట్టినట్టుగా అడిగింది.

"ఆడపిల్లవన్న జాలికూడా లేకుండా నిన్ను బ్రోతల్ హౌస్‌కి ట్రాన్స్‌ఫర్ చేయిస్తాను."

"ఏం కూశావురా ?" సువర్ణ కాలినుండి చెప్పు తీసింది.

ప్రక్క సీటునుండి జానకి రివ్వునవచ్చి సువర్ణ చెయ్యి పట్టుకొంది. "అనవసరంగా గొడవ సృష్టించకు, సువర్ణా! ఆ అల్లుడికి తగ్గ మామలాగే ఉన్నాడు. అతడిని ఊరికే వెళ్ళనివ్వు."

"వాడి కూతుర్ని పంపుకోమను బ్రోతల్ హౌస్‌కి. నన్ను పంపడానికి వీడెవడు ?"

"నా కూతురు నిప్పులాంటి పిల్ల నీలాగా పెళ్ళికిముందే తల్లి కావడంలేదు. జరిగిన దానికి కుక్కిన పేనులా ఉండక నాకు ఉత్తరం వ్రాసినప్పుడే అనుకొన్నాను సిగ్గూ లజ్జా లేని ఆడదానివని. నీలాంటి బజారు సరుకు మాటలు పట్టుకొని లక్షణమైన సంబంధం ఒదులుకొంటామనుకొన్నావా ? నేనంత మూర్ఖుణ్ణికాను. ఆ సంగతి చెప్పి పోవడానికే వచ్చాను. ఇహ పిచ్చివేషాలు వేయొద్దు." దర్జాగా అడుగులు వేస్తూ నడిచాడు.

"కథ ఇలా అడ్డం తిరిగిందేమిటి ?" జానకి తలపట్టుకొన్నట్టుగా అంది.

వినోదంగా చూస్తూన్న స్టాఫ్‌ని చూస్తూంటే ఒళ్ళు మండుకు వచ్చింది సువర్ణకి. "ఒక్క ఆఫీసులో పనిచేస్తున్నవాళ్ళం తమ కళ్ళముందే ఒక ఆడపిల్లను బయటి వాడొచ్చి ఇంత దారుణంగా అవమానం చేసి వెడుతుంటే ఒక్కడు, ఒక్కడు ముందుకు వచ్చి, ఇదేం దౌర్జన్యం ?" అని అడిగిన పాపాన పోలేదు. ఛీ! ఏం మగవాళ్ళు?" ఆవేశంగా అంది

సుదర్శనం ప్రక్క సీటులో పని చేస్తున్న ప్రసాద్‌తో, "కాలుజారి కడుపు తెచ్చుకోవడం కూడా ఈ కాలం ఆడవాళ్ళకి ఓ ఘనత అయిపోయినట్టుంది. 'నన్ను మోసం చేశాడు! నేను తల్లినౌతున్నాను' అని చాటింపు చేసుకొనే ఆడదాని ధైర్యానికి ఏ మగవాడు మాత్రం సాటి అవుతాడు!" అన్నాడు జానకివాళ్ళు వినాలన్నే కొంచెం పెద్దగా.

"చూశావా ? నిన్ను నువ్వు ఎంత చులకన చేసుకొన్నావో ?" అంది జానకి బాధగా

"జరిగిన అన్యాయానికి నోరు మూసుకు కూర్చోవడం నాకు చాతకాదుమరి. చాటింపు చేస్తాను. ఇంకా చాటింపు చేస్తాను!" భాస్కర్‌ని అందరూ తూ. ఛీ. అనే వరకు అందరికీ చెప్పుకు తిరుగుతాను." అంది కసిగా.

"తూ. ఛీ. అని అతడిని అనరు. నిన్నే అంటారు, అంటున్నారు ఇప్పటికే."

"అదే ఎందుకని అడుగుతున్నాను!"

"పెళ్ళికి ముందే శీలం పోగొట్టుకొన్న ఆడదాన్ని ఎవరూ గౌరవంగా చూడరు."

"శీలం అతడికి పోలేదా ?"

"ఇది రామాయణం కాదు."

"ఈ అసమానతే పోవాలి ! నైతిక విలువలు స్త్రీ పురుషులకు సమానంగా ఉండాలి ! అందుకోసమే నేను పోరాడతాను. నా జీవితం ఎంత నవ్వులపాలైనా సరే !"

జానకి నిస్పృహగా, 'ఏం చేస్తే నీ మొండితనం వదులుతావో తెలియకుండా ఉంది!" అంది.

○ ○ ○

భాస్కర్ పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది.

పదిహేనురోజుల సెలవు అయిపోగా, వచ్చి డ్యూటీలో జాయిన్ అయ్యాడు భాస్కర్. పెళ్ళికి రాని స్నేహితులకి, బంధువులకీ వెయ్యిరూపాయల ఖర్చుతో ఘనంగా పార్టీ ఇచ్చాడు హోటల్లో.

సువర్ణ గుండెలో మంటలు ! ఏం చేయాలి అతడిని ? తన జీవితాన్ని కాలరాచిన అతడు తన కళ్ళముందే మరొకదాన్ని పెళ్ళాడి కులుకుతున్నాడు! ఇంత అన్యాయం తనకు జరిగినా ఒక్కరూ తనపట్ల జాలి చూపడంలేదు. భాస్కర్‌ని చెడ్డవాడని అనటంలేదు !

సువర్ణ భగ్గుమన్నట్టుగా చూస్తే, తనతో సవాలుచేసి ఘోరంగా ఓడిపోయినదాన్ని చూసినట్టుగా చూస్తాడు భాస్కర్ !

నెలరోజుల తరువాత భాస్కర్ భార్యని కాపురానికి తీసుకొచ్చాడని తెలిసింది సువర్ణకి ! అందుకోసమే చూస్తుంది సువర్ణ.

ఆమెలో ప్రతీకార జ్వాల భగ్గుమన్నట్టుగా అయింది !

ం ం

వంటపనిలో ఉన్న సావిత్రి తలుపుమీద ఎవరో టకటక కొడుతున్న శబ్దం విని "ఎవరూ?" అంటూ వచ్చి తలుపు తీసింది. ఎదురుగా ఎవరో అపరిచితమైన యువతి. హాండ్ బాగ్ భుజానికి తగిలించుకొని తెల్లటి ప్రింటు చీరలో విద్యావంతురాలైన యువతిలా కనిపించింది.

"ఎవరు కావాలండి ?"

"మీరు సావిత్రి కదూ మిసెస్ భాస్కర్...."

"అవును !"

"నాకు మీరే కావాలి. నా పేరు సువర్ణ ! బహుశ, నా పేరు, నా గురించి వినివుండరనుకుంటా !"

"మెల్లేరు ! లోపలికి రండి !"

ఒక్క క్షణంలోనే సావిత్రిని అంచనా వేసుకొంది సువర్ణ. గొప్ప అందగత్తె కాదు గాని, చదువూ సంస్కారం మూర్తీభవించిన యువతిలా కనిపించింది. తను చెప్పేది ఎలా రిసీవ్ చేసుకొంటుందో

సువర్ణ లోపలికి వచ్చి సోఫాలో కూర్చొంది. క్రొత్తగా పెళ్ళైనట్టుగా ఉన్న వస్తువులు. క్రొత్త కాపురం, కొత్త భార్య, టేబిల్ మీద స్టీల్ ఫ్రేమ్‌లో భాస్కర్, సావిత్రిల పెళ్ళిఫొటో చూసేసరికి సగం మండి నట్టుగా అయింది సువర్ణ మనసు.

"నేనూ, భాస్కర్ ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం. నేను టైపిస్టుని !"


"అలాగా ? కూర్చోండి, వస్తాను! పొయ్యిమీద కూర మాడిపోతున్నట్టుగా ఉంది !" సావిత్రి పరిగెత్తినట్టుగా వెళ్ళి అయిదునిమిషాల తరువాత కాఫీ కప్పుతో వచ్చింది. "తీసుకోండి !"

"ఇప్పుడు కాఫీ ఎందుకండీ ?" బలవంతంగా తీసుకొంటున్నట్టుగా తీసుకొంది సువర్ణ కాఫీ మెల్లగా సిప్ చేస్తూ అడిగింది, "నిజం చెప్పండి ! నా గురించి మీ ఆయన వల్లగాని, మీ నాన్నగారివల్లగాని ఏమీ వినలేదూ?"

"నిజమండీ ! మావారి ఆఫీసులో ఒక లేడీ టైపిస్టు ఉందనే సంగతే నాకు తెలియదు !"

"మీరెంతవరకు చదివారు ?"

"బి. ఎ. పాసయ్యాను."




"పెళ్ళి పత్రికలో మీ డిగ్రీ వెయ్యలేదేం ?" అదిరిపడ్డట్టుగా అడిగింది సువర్ణ.

"ఈ కాలంలో బి. ఎ. అంత గొప్పగా తగిలించుకోవాల్సిన డిగ్రీ ఏం కాదని నా ఉద్దేశ్యం !"

స్టూల్ మీద బోలెడు వార, మాస పత్రికలుండటం చూసి "మీరు పత్రికలవీ బాగా చదివేట్టున్నారు." అడిగింది సువర్ణ.

"ఆఁ కొంచెం నవలల పిచ్చి. పత్రికల పిచ్చి ఎక్కువే !"

"ఏమైనా వ్రాస్తుంటారా ? చదవడం వరకేనా ?"

"వ్రాయాలని అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది. కాని, కలం కాగితంమీద పెట్టబోతే ఆలోచనలన్నీ గజిబిజిగా తయారై ముందు ఏం మొదలుపెట్టాలో తెలియకుండా పోతూంటుంది. అందరూ చదవగలరేమో గాని, వ్రాయను మాత్రం వ్రాయలేరు. అది కొందరికే వరం !"

ఏదో కాలక్షేపానికి మాట్లాడుతున్నట్టుగా ఉన్నా సావిత్రి అభిప్రాయాలు యుక్తిగా తెలుసుకోసాగింది సువర్ణ. ఈనాటి ఆడపిల్లల సమస్యల గురించి మంచి అవగాహన ఉంది సావిత్రికి, వివాహ వ్యవస్థమీదా, స్త్రీ హక్కులమీదా చాలా ఖచ్చితమైన అభిప్రాయాలే ఉన్నాయి ఆమెకు.

సంభాషణని యధాలాపంగా నడుపుతున్నట్టుగానే, అంది సువర్ణ. "ఒక యువకుడు ఒక యువతిని ప్రేమించినట్టుగా నటించి, ఆమెతో శరీర సుఖాన్ని పొంది పెళ్ళిమాత్రం మరొక యువతితో చేసుకొన్నప్పుడు, అలాంటి మోసగాడైన మగాడికి ఏం శిక్ష వేయాలని తీర్పు ఇస్తారు మీరు ?"

"ఒక చెడిపోయిన ఆడదానికి ఈ సమాజం ఏ శిక్ష విధిస్తుందో, అదే శిక్షను మోసగాడైన మగాడికి విధించాలని తీర్పు ఇస్తాను."


"ఇది కేవలం చర్చలకే పరిమితమా ? ఆచరణలో కూడా పెట్టగలరా ?"

"నా భర్తే అలాంటి మోసగాడైతే అతడిని తక్షణం నేను వదిలిపెట్టేస్తాను " దృఢంగా అంది సావిత్రి.

"తమాషాకి కాదు ! నిజంగా వదిలి పెట్టేస్తారా ?"

"నిజంగానే !"

"భాస్కర్ నన్ను మోసగించాడు, సావిత్రీ ! ఆరునెలల క్రితం మా ఆఫీసుకి ట్రాన్స్‌ఫరై వచ్చాడు పెళ్ళి కానివాడు. కాస్తో, కూస్తో అందగాడు. ఆడపిల్లల్ని ఆకర్షించడంలో మెళుకువలు నేర్చినవాడు. అతడు విసిరిన వల అనురాగపూరితమైనదని అనుకొన్నానుగాని, కేవలం అవసరం తీర్చుకోవడానికేనని అనుకోలేకపోయాను. ఒక రోజు చెప్పాపెట్టకుండా ఆఫీసులో మీ పెళ్ళి పత్రికలు పంచాడు. అందరి ముందే తగాదా పెట్టుకొన్నాను. మగవాడిని నన్నేం చేయగలవన్న ధీమాకి పోయాడు ఒళ్ళుమండి మీ నాన్నగారి అడ్రస్ సంపాదించి భాస్కర్ ఎలాంటి మోసగాడో అంతా వివరిస్తూ ఉత్తరం వ్రాశాను. అతడి ప్రతిబింబం ఇప్పుడు నా కడుపులో రూపుదిద్దుకొంటూందని కూడా వ్రాశాను. పెళ్ళి ఆపుచేయడానికి బదులు మీ నాన్న ఏం చేశాడో తెలుసా? ఆఫీసుకి వచ్చి నన్ను అవమానించాడు. వట్టి బజారు సరుకునన్నాడు. నోరు కదిపితే బ్రోతల్ హౌస్‌కి ట్రాన్స్‌ఫర్ చేయిస్తానన్నాడు. పెళ్ళికిముందే మరొక ఆడదానితో సంబంధముందని తెలిసీ ఆయన కూతుర్ని ఇవ్వడానికి సిద్ధపడ్డాడంటే ఆడపిల్ల




తండ్రిగా ఒక విధమైన కక్కుర్తి కనిపించింది ఆయనలో. మగపిల్లలకి డిమాండ్ అలా ఉంది. కాస్త చదువు, ఉద్యోగం ఉంటే చాలు, ఇహ ఎన్ని అవలక్షణాలున్నా పట్టించుకోరు. కాళ్ళు కడిగి కన్యాదానం చేయడానికి ఆడపిల్లల తల్లిదండ్రులు పోటీ పడతారు. మరో స్త్రీతో సంబంధం కలిగి ఉండడం మగవాడికి పెద్ద తప్పు కాదు ఈ సమాజంలో. అసలు తప్పు కాదు. అదే కొడుకు పెళ్ళిచేస్తూ, కోడలి కారెక్టర్ మంచిది కాదని తెలిస్తే మాంగల్యం కట్టబోతున్న చివరి క్షణంలో కూడా ఆ పెళ్ళి ఆపేయడానికి సిద్ధమే! జరిగిన తప్పులో ఇద్దరం బాధ్యులం అయినప్పుడు నేను మాత్రం చెడిపోయినదాన్ని, అతడు మగ మహారాజు! ఏమిటీ అసమానత! ఏమిటీ అన్యాయం? నన్ను అన్యాయం చేసినవాడు నా కళ్ళముందే కులుకుతూంటే ఎలా భరించను?"

సావిత్రి ముఖం అప్పటికే బాగా పాలిపోయింది. తన సర్వస్వం నడియేట్లో మునిగిపోయిన భావం ఆమె ముఖంలో!

"నా ఉద్దేశ్యం ప్రకారం శీలం ఇద్దరికీ అవసరమైనదే! పెళ్ళికి ముందే మరొక స్త్రీతో సంబంధమున్న భాస్కర్ నీడ కూడా నేను సహించలేను! ఎందుకంటే అదెప్పుడో నిశ్చయమైన సంగతి నా మనసులో!"

సువర్ణ ఆశ్చర్యంగా "ఎప్పుడో నిశ్చయం చేసుకొన్నారా?" అని అడిగింది

"ఆఁ మా నాన్నకి రెండు కాపురాలు. ఒకటి లైసెన్సు ఉన్నదీ, ఒకటి లైసెన్సు లేనిదీ! తన రెండు కాపురాలు రెండు కళ్ళుగా చెప్పుకొంటాడు మా నాన్న, సగర్వంగా. నిజంగా కూడా ఆయన భార్యాబిడ్డల్ని ఎలా చూచుకొంటాడో ఉంచుకొన్నదాన్నీ, దాని పిల్లల్నీ కూడా అలాగే చూచుకొంటాడు. అంతా మాలాగే వాళ్ళకీ. చదువులూ, పెళ్ళిళ్ళూ, బట్టలూ, ఆస్తులు కూర్చటం, ఇళ్ళు కట్టివ్వడం. 'ఆయనకేం? రెండు కాపురాలనీ సునాయాసంగా ఈదుతున్న మగమహారాజు' అంటారు జనం! ఇద్దరు స్త్రీలతో సంబంధం కలిగి ఉన్నందుకు ఆయన్ని అగౌరవపరిచేవాళ్ళు లేరు!

"కాని, మా అమ్మ, కుమిలిపోని రోజు ఉండేది కాదు. మాకు కాస్త బుద్ధి తెలిశాక, మా అమ్మని నేనూ, మా అక్కయ్యా తిట్టేవాళ్ళం. 'నువ్వు గట్టిగా ఎదిరించి ఉంటే నాన్న మరో కాపురం ఎలా పెట్టేవాడమ్మా? అసలు, ఆయనతో కాపురం ఎలా చేస్తున్నావు? మేమైతే దాని దగ్గరికే పొమ్మని తరిమేవాళ్ళం. అసలు ఆయన్ని ఇంట్లోకే అడుగుపెట్టనిచ్చేవాళ్ళం కాదు." అని అమ్మతో వాదించేవాళ్ళం. అమ్మ 'మీకు తెలీదు! పెళ్ళయితే తెలుస్తుంది' అనేది. మేం మాత్రం గట్టిగా అనుకునేవాళ్ళం, అమ్మ బలహీనతవల్లే నాన్న బయట ఆటలాడగలుగుతున్నాడని. మగాడికో నీతి, ఆడదానికో నీతి ఏమిటని ఉద్రేకపడిపోయేవాళ్ళం. మా జీవితాలలో నాన్నలాంటి మనిషి భర్తగా ఎదురైతే అతడిని ఎంత మాత్రం భరించకూడదని అప్పుడే నిర్ణయాలు చేసేసుకొన్నాం. దురదృష్టవశాత్తూ నాకు అలాంటి మనిషే భర్తగా వచ్చాడు. నాన్నకంటే కూడా ఈ మనిషి అంత హీనుడు! నాన్న ఆమెను మోసం చెయ్యలేదు!

"సాటి ఆడదానిగా నా వంతు సహాయం నేను చేస్తాను, మీకు జరిగిన అన్యాయానికి. ఒక స్త్రీని మోసగించిన మొగాడిని తగిన విధంగా శిక్షించాల్సిందే. భాస్కర్‌తో తెగ తెంపులు చేసుకొని నేను ఈరోజే మా ఊరు వెళ్ళిపోతాను. చట్టపరంగా విడిపోవడానికి కోర్టు ద్వారా నోటీస్ ఇప్పిస్తాను!"

"మీవాళ్ళు ఊరుకొంటారా?" ఆశ్చర్యంగా అడిగింది సువర్ణ.

"ఊరుకోరు! చదువుకొన్నానుగా? నా బ్రతుకు నేను బ్రతకగలను! చదువుకోకపోయినా ఆడది తన బ్రతుకు తను బ్రతకగలదు. ఏ చదువూ, సంధ్యా లేని పల్లెపడచులు బ్రతకడం లేదా చేల పనులకు, మట్టి పనులకు వెడుతూ! ముఖ్యంగా ఆడదానికి ఉండాల్సింది ఆత్మాభిమానం కాని, ఎలా బ్రతుకుతున్నామన్నది కాదంటాను."

"మీ తల్లిదండ్రులు మీ చర్యను సమర్థించకపోతే?"

"ఇంతవరకు నా తల్లిదండ్రులకు ఎదురుతిరగాల్సిన అవసరం కనిపించలేదు. ఇంతవరకు వాళ్ళు నా ముద్దు ముచ్చటలన్నీ తీర్చారు, చదివించారు. కాని చదువు తప్ప సంస్కారం లేనివాడికిచ్చి పెళ్ళిచేశారు. ఇప్పుడు ఎదురుతిరగాల్సిన సమయం వచ్చింది నాకు. భాస్కర్ ఎలాంటివాడో తెలిసికూడా నన్నిచ్చి చేయడం తప్పుకాదా? కారెక్టర్ అన్నది ఆడదానికేగాని, మగాడికి అక్కరలేదని ఎందుకనుకొన్నారు? ఆ తప్పుమీదే నేను వాళ్ళతో యుద్ధం చేయగలను." స్థిర నిశ్చయంతో అంది సావిత్రి.


o o o

మరునాడుదయం,

సువర్ణ డ్రైవ్‌చేస్తోందన్నమాటేగాని, ఆమె ధ్యాసంతా భాస్కర్ సీటుమీదే ఉంది. అతడి సీటింకా ఖాళీగానే ఉంది.

నిన్న ఏం జరిగుంటుంది? సావిత్రి తను అన్నమాట నిలబెట్టుకొందా? లేక ఆవిడ మాటలు పాలపొంగును చేశాడా భాస్కర్?

అరగంట లేట్‌గా వచ్చాడు భాస్కర్




వస్తూనే సువర్ణ బల్లదగ్గరికి చ్చి ఆమె కళ్ళలోకి ఉగ్రంగా చూస్తూ, ' రాక్షసీ మా కాపురంలో చిచ్చు పెట్టావుకదా " అన్నాడు.

"నా జీవితంలో పెట్టలేదా నువ్వుచిచ్చు .... నిన్ను వదిలేసి పోయింది నీపెళ్లాం?" సువర్ణ కాళ్ళూపుతూ చాలా హేళనగా, తాపీగా అడిగింది.

"పిచ్చిముఖం! వివాహబంధాన్ని అంత తేలిగ్గా త్రెంచుకొంటుందా? నవలలు చదివిన ప్రభావంతో కొత్త డైలాగులు విసి రాల్సిందేగాని! పోతే ఎంతదూరం పోతుంది! రేపటికి తిరిగిరాదూ, వాళ్ళవాళ్ళు నాలుగు చీవాట్లు వడ్డింపు చేయగానే!" భాస్కర్ పౌరుషం చావనట్టుగా అన్నాడు.

○ ○

పదిహేను రోజుల తరువాత సావిత్రి నుండి ఒక ఉత్తరం వచ్చింది సువర్ణకు

"డియర్ సువర్ణా!

భర్తతోటేకాదు! నాకు తల్లిదండ్రులతో కూడా తెగత్రెంపులు జరిగిపోయాయి. నే నిప్పుడు ఈ ఊళ్ళోనే ఒక ఫ్రెండు సాయంతో ఒక హాస్టల్‌కి వార్డెన్‌గా ఉద్యోగం సంపాదించుకోగలిగాను. నీకంటే ఒక అడుగు ముందుకే వేశానేమో! పటిష్ట మైన వివాహ బంధాన్నే త్రెంచుకొని బయటపడ్డాను. సర్వస్వతంత్రురాలి నయ్యాను. ఒకసారి పెళ్ళయిన ఆడది భర్త ఎలాంటివాడైనా అతడిని వదిలిపెట్టకూడదు ఎట్టి పరిస్థితుల్లోనూ. అతడి పాదాలదగ్గరే పెంపుడు కుక్కలా పడిఉండాలి. అతడు కి ఇష్టై బొమ్మలా నడుచుకోవాలి. నేను ఈ సమాజపు కట్టుబాటును అతిక్రమించాను. ఒక చెడిపోయిన ఆడదాన్ని మగవాడు ఎలా వదిలివేస్తాడో నేను నా భర్తను అలా వదిలిపెట్టేస్తాను. ఆదినుండి మగవాడికేమిటి తప్ప అనుకోవడంవల్లే, మగవాడు ఇలా ఆడదాన్ని వాడుకొని వదిలివేయగలుగు తున్నాడు. ఆడదాన్ని అతిసులువుగా మోసం చేయగలుగుతున్నాడు. భాస్కర్ లాంటి మగవాళ్ళకి ఏం శిక్ష విధించాలో తెలుసా? ఇక ఏ స్త్రీ కూడా ప్రియురాలిగా, భార్యగా అతడి దగ్గరికి వెళ్ళకూడదు. ఒక చెడిపో యిన స్త్రీని సభ్య సమాజం ఎలా వెలి వేస్తుందో అలా వెలివేయాలి. అప్పుడుగాని ఈ మగవాళ్ళకి బుద్ధిరాదు.

కాని, మన సమాజంలో ఆడపిల్లల తలి దండ్రులకు కక్కుర్తి ఎక్కువైపోతూంది. మగ విధవ కనిపిస్తే చాలు తమ పిల్లల్ని కట్టబెట్టెయడానికి తహతహలాడతారు. భాస్కర్‌కి మరో స్త్రీతో సంబంధముందని తెలిసి సన్నివ్వడం ఒక ఉదాహరణ. ఇంకా ఎన్నెన్నో ఉదాహరణలు. ఆ మధ్య నా ఫ్రెండు ఒకతె కట్నం తేలేదన్న బాధ పడలేక ఒళ్ళు కాల్చుకు చనిపోయింది. నెల తిరక్కుండానే అతడికి పిల్లనిచ్చారు. నాకు తెలిసిన ఒకావిడను ఆవిడ భర్త గొంతు నులిమి చంపేసి ఆత్మహత్య అని చెప్పడాని కన్నట్టు ఆమె ఒంటిమీద కిరోసిన్ పోసి అంటించాడు. అతడికి పిల్లనిచ్చారు.

మగవాడిని ఎంత దుష్టుడైనా, లంపటుడైనా ఎందుకని శిక్షించదు ఈ సమాజం పెళ్ళాన్ని హత్యచేసినవాడికి కూడా పిల్ల నిచ్చి ఓ ఇంటివాడిని చేస్తారెందుకు? స్త్రీని మోసగించినవాడిని అందరూ వెలేసి గజ్జి కుక్కలా తరిమితే ఇంకో మగాడు అలాంటి పని చేయగలడా? ఎవరూ వాడిని శిక్షించకపోవడంవల్లే ఆడవాళ్ళతో ఆటలా గలుగుతున్నాడు.

నా దాంపత్య జీవితంలో మొదటి అడు గేస్తూనే అది రొచ్చుగుంటగా కనిపించ డం నా దురదృష్టం: ఆ గుంటలోనే బ్రతకడం నాకు చాతకాదు గనుక బయటికి వచ్చే శాను! ఇహ జీవితమంతా ఒంటరిగానే సా పోతానని అనుకోవద్దు: నన్ను అర్థం చేసుకో గలవాడు, నాకు నచ్చినవాడూ వస్తే అతడి చేయికలుపడానికి నాకేమీ అభ్యంతరం లేదు.

సువర్ణా! నీకూ నా సలహ ఏమిటంటే తెలియక ఒకసారి బురదగుంటలో పడ్డావు. ఆ బురదను కడుక్కొని క్రొత్త జీవితం నిర్మించుకోవడం విజ్ఞత. జరిగిన పొరపాటుకి నీ జీవితాన్నే బలిపెట్టా నక్కరలేదు. నిన్ను అర్థంచేసుకోగలవాడు వచ్చినపుడు నువ్వు అతడి చేతినందుకోవడా నికి వెనుదీయవద్దు.

మనిద్దరం రెండు రకాలుగా ఆశ్చర్యా కంగా కనిపిస్తాం కదూ ఈ సమాజానికి.

అవును! ఆడదాని చరిత్ర ఎప్పటి ఒకేలాగ ఎందుకుండాలి? మనకు కావలసిన హక్కులు సంపాదించుకోడానికి మన జీవితాలు నాశనమైనా పర్వాలేదు. మన జీవితాలు ముందుతరానికి బాటగా తయారైతే చాలు! ఉంటాను— సావిత్రి."

కొద్దిరోజులు గడిచాయి.

ఒకరోజు జానకి ఆఫీసుకు వస్తూ ఒక వార్త మోసుకువచ్చింది. "సువర్ణా సంగతి విన్నావా?"

"ఏమిటి?"

"భాస్కర్‌కి ఆయన భార్య విడాకుల నోటీస్ ఇచ్చిందట."

"ఇది నా తొలి విజయం!" సగర్వంగా అంటున్న సువర్ణ ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

"కాని, ఏం లాభం? చెడిపోయినదా వని ప్రచారమయ్యావు కదా! ఇంకెవ

చేసుకొంటారు నిన్ను?"

"జీవితంలో నాకంటిన బుపును దాచుకొని ఎవరినీ మోసగించాలని లేదు జానకీ! అది మొదటి తప్పుకంటే మరీ హీనమైన తప్పు. ఉన్నదున్నట్టుగా నన్ను గ్రహించగలవాడు వచ్చినప్పుడే నేను పెళ్ళి చేసుకొంటాను. లేకపోతే లేదు."

"చెడిపోయానని బాహాటంగా చెప్పుకొనే ఆడదాన్ని స్వీకరించగల గుండెదిటవు మగవాడు పుట్టలేదనుకొంటాను, సువర్ణా! అందుకే ఆడది తప్పుచేస్తే గుట్టుగా దాచుకోవడం! నువ్వు ఆ సాంప్రదాయానికి విరుద్ధంగా నడిచావు."

"నేను నా తప్పును గుట్టుగా దాచదమంటే భాస్కర్ దుర్మార్గాన్ని దాచడమన్నమాటేగా? దొంగని దొర చెలామణీ కానివ్వటమే కదా?"

"అనాదిగా మగాడి నుండి మోసపోయిన ఆడది చేస్తున్న పని అదేగా" గుట్టుగా

"ఎప్పటికీ ఆ చరిత్ర అలాగే ఉండదు, జానకీ! దానిలో మార్పు రావాలి. వచ్చి తీరాలి! మగాడి మోసానికి [illegible] చెప్పాలి!"

"ఒక భార్య విడాకులిచ్చినంతమాత్రాన అతడికి బుద్ధి వస్తుందంటే నేను నమ్మను. రేపీపాటికి మళ్ళీ పెళ్ళికొడుకు కాకపోతే చూడు."

"అదే మన సమాజంలో ఉన్న దౌర్భాగ్యం. ఒక ఆడపిల్లకు అన్యాయం చేసిన మగాడిని శిక్షించడానికి బదులు పిల్లనిచ్చి సత్కరిస్తారు! ఒక మగాడికి బుద్ధి రావాలంటే మొత్తం సమాజానికే బుద్ధి రావాలి! మోసగాడైన మగాడిని కలిసి కట్టుగా శిక్షించాలి."

"నీది వట్టి ఆవేశం! సమాజంలో ఆ మార్పు ఎప్పటికీ రాదు."

"ఎందుకా నిస్పృహ? స్త్రీలకు సంబంధించిన ఎన్నో విషయాల్లో మార్పు వచ్చింది. సహగమనం, బాల్య వివాహాలు, విద్యావకాశాలు లేకపోవడం — ఎన్నిటిలోనో మార్పు వచ్చింది. న్యాయం లభించింది! ఈ విషయంలోనూ, మగాడికో నీతి, ఆడదానికో నీతి' ఏమిటన్న దాంట్లో కూడా న్యాయం జరుగుతుందని నా ఆశ, నమ్మకం! కాని, ఊరికే జరుగదు. నాలాంటివాళ్ళు కొందరు బలిఅయితే తప్ప అది జరగదేమో!" సువర్ణ గంభీరంగా అంది. ●

